# ఓ పోలీసోడి కథలో ఓ రోజు

## రాచకొండ ఉమాకుమార్ శాస్త్రి

రాఘవయ్యని దగ్గరకి రానిచ్చి, అప్పుడు పలకరించాడు మురళి, "హలో! రాఘవయ్యగారూ!" అని.

"ఆ! మురళీ వచ్చావా, ఎంతసేపు అయ్యింది వచ్చి. ఇప్పుడే నీ గురించి ఎదురుచూ
వస్తున్నాను. ఇంద నాలుగు రూపాయల టిక్కెట్లు రెండు కావాలన్నావుగా" అంటూ జేబులోనుంచి తీసి మురళికి ఇచ్చాడు రెండు టిక్కెట్లు.

ఉదయం మురళి దగ్గిర పదిహేను రూపాయిలు తీసుక్కున్నాడు రాఘవయ్య. అందులోనే పేకెట్టు సిగరెట్లు రిక్షావాడికి డబ్బులు ఇచ్చాడు. ఇప్పుడు రెండు టిక్కెట్లు అయిపోగా మిగిలింది నొక్కేసేడు.

మురళికి తెలుసు: హుండీలో వేసిన సొమ్ము మనకి తిరిగి రాదని, వెలిగించేసిన కర్పూరాన్ని తిరిగి రప్పించలేమని, ఆడదాని శీలం పోతే తిరిగి రాదని, కాల్చబడిన కాష్టానికి తిరిగి జీవం రాదని, అలాగే రాఘవయ్య చేతికి డబ్బు "ఇస్తే" తిరిగి రాదని.

అందుకే టిక్కెట్టు తీస్కొని "థాంక్స్" చెప్పకుండా "వస్తానండీ" అనేసి జారుకున్నాడు. పాము కాటు వేస్తే ఒకటికి పైగా వేస్తుంది. అందుకే రెండో కాటుకి బలి అవ్వకూడదని జోరుగా వెళ్ళి పోయాడు.

ఈ లోపున రాఘవయ్యని మూర్తి కలిసాడు. బాగా చెమటలు పట్టి ఉన్నాయి. ఎండలో మాడిపోవల్సివచ్చింది అందుకే రాఘవయ్యా, ఇంకో పోలీసూ నిల్చునిఉన్న నీడలోకి వచ్చేసరికి "మొగుడు పోయినదాన్ని పెళ్ళాడుతాను అని వచ్చిన కొత్త భర్తను చూసిన విడోలాగా" హాయిగా ఒకసారి కళ్ళు మూసుకుని గుండెల నిండా గాలిపీల్చుకుని వదిలాడు.

మూర్తి పరిస్థితిని గమనించిన రాఘవయ్య "ఈ మాత్రానికే యిలాగ అయిపోతే ఎలాగ" అన్నాడు.

"మా ఊర్లోకన్నా మీఊర్లో ఎండలు బాగా ఉన్నాయి. 9-30కే ఇలాగ ఉంటే మరింక మధ్యాహ్నం ఎలాగ ఉంటుందో" అన్నాడు మూర్తి ఎండవైపు చూస్తూ.

"ఇంద అందాకా ఈ సిగరెట్టు కాల్చు ఫ్రెష్‌గా ఉంటుంది" అని ఓ వంగిపోయిన సిగరెట్టుని ఇచ్చాడు రాఘవయ్య.

"సచ్చినోడి పెళ్ళికి వచ్చిందే కట్నం" అని మూర్తి దాన్ని అందుకుని సరిచేసి నోట్లో పెట్టుకున్నాడు. రాఘవయ్య పక్కనున్న పోలీసు అగ్గి ఇచ్చాడు. ఎంతలాగినా రానంటున్న దమ్మని గట్టిగాలాగి వెలిగించాడు మూర్తి.

"ఆ చెప్పడం మర్చిపోయాను. ఇతను పురుషోత్తమరావు అని నా ఆప్తమిత్రుడు. అని అప్పుడు "దొంగ వెళ్ళిన ఆరు నెలలకు కుక్క మొరిగినట్లు" ఆపక్కనున్న పోలీసుని మూర్తికి పరిచయం చేసాడు రాఘవయ్య.

ఇతను మూర్తి అని ఇక్కడికి కొత్తగా వచ్చాడు అని అతనికి పరిచయం చేసాడు.

ఇద్దరూ పరస్పరం విష్ చేసుకున్నారు. పేరుకు తగ్గట్టుగా లేదు అతని వర్చస్సు. బహుశా అందుకే పోలీసు అవదల్చి ఉంటాడు. ఒక ఐదు నిముషాలు అయ్యాక రాఘవయ్య అన్నాడు. "పదండి ఇప్పుడు బ్లాకులో టిక్కెట్లు ఎవడు అమ్ముతున్నాడో వాడ్ని మోసెయ్యాలి" కాకపోతే ఇక్కడ ఒక చిన్న రాజకీయం ఉంది అని మూర్తితో అన్నాడు.

"ఏంటండి?" అది అన్నాడు మూర్తి.

"ఏమీ లేదయ్యా, ఈ థియేటరుకి అయిదుగురు బ్లాకు వాళ్ళు ఉన్నారు. వాళ్ళకీ ఈ థియేటరు వాళ్ళకీ డీలింగ్స్ ఉంటాయి. ఈ బ్లాకు వాళ్ళకి కొన్ని టిక్కెట్లు కేటాయిస్తారు. అవి ఈ బ్లాకువాళ్ళు కొంటారు. ఇప్పుడు నాలుగు రూపాయల టిక్కెట్లు ఉన్నాయనుకో. వాటిని ఈ బ్లాకువాళ్ళు ఐదురూపాయలకి కొని, వీలైనంత ఎక్కువకి అమ్ముకుంటారు. అది డీలింగు. కానైతే ఇప్పుడు ఈ ఐదుగురు కాక మరి కొంతమంది ఎవరైనా అమ్ముతుంటే వాళ్ళని పట్టుకోవాలి. ఈ అయిదుగురు మాకు తెలిసిన వాళ్ళే కాబట్టీ మేము అనుమానించిన వాడినే నువ్వూ అనుమానించాలి" అని విపులీకరించాడు పక్కనున్న పురుషోత్తమరావు.

ముగ్గురూ బయటకు వచ్చారు. గేట్లు మూసేసారు. టిక్కెట్లు ఉన్న వాళ్ళనే పంపిస్తున్నారు. గేట్లకి "హవుస్ ఫుల్" బోర్డు ముచ్చటగా వేలాడుతున్నది.

ముగ్గురూ పదిహేను నిమిషాలు తిరిగారు. తరవాత లోపలికి వచ్చేసారు.

"ఎవ్వరూ కనపడలేదేంటండీ" అన్నాడు మూర్తి.

**సవరణ**

10-5-85 సంచికలో ప్రకటించిన 'ఓ పోలీసోడి కథలో ఓరోజు' అనే పెద్దకథ ముగింపు అధ్యాయం పొరపాటున 17.5.85 సంచికలో ప్రకటించ బడినందుకు చింతిస్తున్నాము. ఈ కథ 10.5.85 సంచికకు తరువాయి భాగం 24.4.85 సంచికలో పూర్తిగా ప్రకటిస్తున్నాము. పాఠకులకు కలిగిన అసౌకర్యానికి విచారిస్తున్నాము.

—ఎడిటర్

"ఇప్పుడు మనం వెతికిన స్థలాల్లో వాళ్ళు ఉండరని మాకు తెలుసు. వాళ్ళు ఉండే ప్లేసు వేరు. అందుకే అక్కడికి వెళ్లకుండా ఇక్కడ వెతికాము" అన్నాడు పురుషోత్తమరావు నవ్వుతూ, హీరోకి అసలు సస్పెన్సు చెప్పిన విలన్‌లాగ.

ముగ్గురూ ఆఫీసురూంలోకి వెళ్లేరు. కాస్సేపటికి బయటికి వచ్చారు. మిగిలిన పోలీసులు ఎప్పుడో వెళ్లిపోయారు. సినిమా మొదలు పెట్టినట్లుగా 'బెల్' కొట్టింది. రహస్యంగా బ్లాకులో కొనుక్కున్న వాళ్ళు పెరిగెట్టుకుంటూ లోపలికి వెళ్లిపోతున్నారు.

"మొత్తానికి ఇవాళ మన డ్యూటీ అంతా ఇక్కడికే అంకితమన్నమాట" అన్నాడు మూర్తి.

"అంతేకదా మరి" అన్నాడు రాఘవయ్య.

పురుషోత్తమరావు స్టాండ్‌లో ఉన్న తన ముసలి సైకిల్‌ని పట్టుకుని బయటకు వచ్చాడు.

ముగ్గురూ రోడ్డు మీదకి వచ్చారు. "వస్తానా! మళ్లీ కలుద్దాం, వస్తానోయ్ మూర్తీ" అంటూ తన ముసలి సైకిలు ఎక్కి దిగుబోటులో తొక్కుకుంటూ పురుషోత్తముడు వెళ్లిపోయాడు. అయినా ఆ సైకిలు జోరుగా వెళ్లడంలేదు.

రాఘవయ్యా, మూర్తీ స్టేషన్ వైపు బయల్దేరారు. పోలీసు స్టేషన్‌కి వచ్చేసరికి సరిగ్గా 10-45 నిముషాలు అయ్యింది. ఇద్దరూ లోపలికి వెళ్లిపోయారు. రైటరుగారిని కలవడానికి.

పోలీసుస్టేషనులో మనం ఇచ్చే ఫిర్యాదు అర్జీలు నోట్ చేసుకుని రిజిస్టర్ చేసే అతన్నే 'రైటరు' అంటారు. అతనే పోలీసుల్ని డ్యూటీ చెయ్యవలసిన స్థలాల్లోకి పంపిస్తాడు. అంటే ఇప్పుడు "ఫలానా చోటకి నువ్వు వెళ్లాలి. నీ డ్యూటీ ఇవాళ అక్కడ పడింది అని నియమించి పంపిస్తాడు." వరసకి ఇంటికి ఇల్లాలు ఎలాంటిదో పోలీసుస్టేషన్లో రైటరు అలాంటివాడు.

రైటరు ఏదో కట్ట చదువుతున్నాడు. "నమస్కారాల్సార్" అని రాఘవయ్యా, మూర్తీ రావడంతో కట్టని అలాగే బోర్లా పెట్టి "ఏంటి సంగతి" అన్నాడు రైటరు. "ఎలాగుందోయ్ మా వూరి ఎండ?" అంటూ మూర్తిని అడిగాడు.

"చాలా బాగున్నాయి సార్, సూర్యుడు ఓ.టి. చేస్తున్నాడనే చెప్పాలి అన్నాడు" మూర్తి.

రైటరు నవ్వేసేడు. అతను చాలా మంచివాడు. అందరినీ సమానంగా చూస్తాడు. బియ్యంలో కల్తీ చేయబడ్డ రాళ్లలాగ అందరితోనూ తొందరగా కలిసిపోతాడు.

"ఇవాళ అంతా ఆ థియేటరు దగ్గిరే గడిచిపోతుంది సార్" అన్నాడుమూర్తి.

"ఇవాళ్టికి తప్పదు మ రి. ఆ ప్రొప్రయిటరు బాగా బతిమాలీసేడు. అతని మాట కొట్టి పారేయలేక సరే అన్నాను. అసలు ఆ ఏరియా వన్‌టౌను వాళ్ళు త్రీటౌన్ వాళ్ళు చూడాలి కానీ అప్పుడప్పుడు ఇలాంటివి తప్పవు. అయినా రేపు కుదరదులే. రేపు కోర్టులో సాక్ష్యం ఉంది మనం వెళ్లాలి" అన్నాడు రైటరు.

"సరే మధ్యాహ్నం ఇక్కడినించే డైరెక్టుగా థియేటరుకి వెళ్తారా. లేకపోతే ఇంటికి వెళ్లి వెళ్తారా" అన్నాడు మళ్లీ.

"ముందు థియేటరుకి వెళ్లి ఆ తరువాత అక్కడి నించి ఇంటికి వెళ్లి మళ్లీ సాయంత్రమే వస్తాము" అన్నాడు రాఘవయ్య.

సరే అన్నాడు రైటరు.

"ఇవాళ రాత్రి కొన్ని లాడ్జీలు రెయిడ్ చెయ్యాలి. మన లాకప్‌రూం బొత్తిగా బోసిపోయింది. పాపుల సంఖ్య తగ్గిపోతున్నాదేమో అని భయంగా ఉంది" అన్నాడు రైటరు అనుమానంతో కూడిన విచారాన్ని వ్యక్తపరుస్తూ రాఘవయ్యతో.

"నాకూ అలాగే అనిపిస్తున్నది సార్" అన్నాడు రాఘవయ్య.

"సరే ఇకమీ పనులు చూస్కోండి. రాత్రి మర్చిపోకు" అని బోర్లించిన కట్టని చదవడం అందుకున్నాడు.

రాత్రి డ్యూటీ ఉన్న ఓ పోలీసు, వాళ్ల మామగారి పరిస్థితి బావులేదంట. రేపో మాపో డైరెక్టు రంభ దగ్గరకి వెళ్లిపోయే సూచనలు ఉన్నాయని (పాపం ఎక్కువ చేసినవాడు ముందర స్వర్గంకి వెళ్లి ఆ తరువాత నరకంకి వెళ్తాడట) టెలిగ్రాము వచ్చింది. అందుకని సెలవు మీద వెళ్లాడు. వాళ్ల మామగారి చావు బతుకుల్ని చూడటానికి.

ఇప్పుడు ఆ డ్యూటీ రాఘవయ్యకి వచ్చింది (టెంపరరీగా).



ఇద్దరూ బయటకి వచ్చేసేరు.


"మధ్యాహ్నం ఇంటికి వెళ్లడానికి ఓ సైకిల్ కావాలండి ఎలాగయినా" అని రాఘవయ్యని మూర్తి అడిగాడు.

"దాన్దేముంది! ఇక్కడ మనవాళ్లది ఎవరిదో పట్టుకెళ్లు. నేను ఇప్పిస్తానులే అంటూ "ఉండు ఒకసారి సైకిల్స్ చూద్దాం మనకి ఏది పనికి వస్తుందో". అని సైకిల్‌స్టాండు వైపు తీస్కెళ్లాడు.

వరసగా ఆరు సైకిళ్లు ఉన్నాయి. వారగా మరో మూడు ఉన్నాయి. వాటిలోమధ్య నున్న సైకిల్ మీద రాఘవయ్య దృష్టి పడింది. అటు వెళ్లాడు.

"ఇదిమన కనకారావు బండిలాగ ఉందే? కనకారావుదే కొత్తసీటు కవరు వేసినట్లుంది. గుర్తు పట్టలేక పోయాను సుమా!" అంటూ మధ్య నించి బయటకి తీస్కొచ్చాడు రాఘవయ్య.

"వాడ్ని అంతే దూరం నించి పోల్చడం




కష్టం. అలాగే వాడి సైకిల్‌ని కూడా గుర్తించ లేము. రోజుకో కొత్తపార్టు తెచ్చి వేస్తూ ఉంటాడు "కొని మట్టుకు కాదులే" అని మూర్తికి చెప్పాడు.

"గాలి ఉందో లేదో చూడండి" అన్నాడు మూర్తి.

"ఉందిలేగానీ, నీ యిష్టం వచ్చినట్లు తొక్కుకో, బండికి ఏమీ అవ్వదు. ఒక వేళ ఏమైనా అయినా మన కనకారావు ఏమీ అనుకోడు. ఎందుకంటే ఇది వాడి సొంతం కాదు. వాడి బండి మనవాళ్లు అందరూ వాడేస్తూ ఉంటారు. కానీ తను అడిగినప్పుడల్లా కాఫీ, సిగరెట్లు ఇప్పిస్తూ ఉండాలి. అందుకే వాడికి "అద్దె బండి కనకారావు" అని పేరు పెట్టేరు మన వాళ్లు" అని వ్యవహారం అంతా చెప్పాడు రాఘవయ్య.

"ఫర్వాలేదు లెండి. ఎడ్జస్టు అయిపో వచ్చును" అన్నాడు మూర్తి.

మధ్య వయస్కుడిలా ఏవరేజు స్పీడుతో కాలం పదీ నలభైఅయిదునించి పన్నెండు గంటలకి వచ్చేసింది.

మూర్తీ, రాఘవయ్యా కనకారావు బండి మీద బయల్దేరారు.

రాఘవయ్య తొక్కుతున్నాడు. తనకి సైకిల్ తొక్కడం అంటే భలే సరదా అట.

కట్నం ఇవ్వకుండా కూతురుకి పెళ్లి చేసిన పేద కుటుంబీకుడిలాగ బతికి పోయ్యాన్రా నాయనా అనుకున్నాడు మూర్తి.

ఎండ చాలా తీవ్రమయిపోయింది. కొన్ని వీధులు, రోడ్లు చాలా నిర్మానుష్యంగా ఉన్నాయి. కొన్ని చోట్ల కర్ఫ్యూ విధించారా అన్నట్లుంది. ఇంకా అర్ధరాత్రే నయమేమో అని అనిపిస్తున్నది రోడ్లని చూస్తూ ఉంటే. ఆకాశవాణి వాళ్లు ఎక్కడ ఆకాశం మేఘావృతమై వుంటుందని హెచ్చరించేస్తారో అన్న భయంతో, తనలో ఉన్న ఎండనంతా ఇప్పుడే ప్రదర్శించేస్తున్నాడా సూర్యుడు అని అనిపిస్తున్నది.

తీవ్రవాదుల సమ్మెలాగ, ఎన్జీవోల స్ట్రయిక్ లాగ, మతస్తుల మత కలహాల్లాగ, అకాలీల డిమాండ్లలాగ సూర్యుడు ప్రజ్వరిల్లిపోతున్నాడు.

నెమ్మదిగా థయేటరుకి వచ్చేరు. గేట్లు తెరిచేసే ఉన్నాయి. సైకిల్‌ని లోపల నీడగా ఉన్న స్థలంలో స్టాండు వేసి వచ్చాడు రాఘవయ్య. అంత ఎండలోనూ జనాలు బాగానే వచ్చారు, వస్తున్నారు.

"అబ్బ! ఇంత ఎండలో కూడా జనాలు బాగానే వస్తున్నారు" అన్నాడుమూర్తి ఆశ్చర్యంగా.

## పినిశెట్టి మృతి

ప్రసిద్ధ నాటక, సినీ రచయిత శ్రీ పినిశెట్టి ఏప్రిల్ 10వ తేదీ మద్రాసులో గుండెపోటుతో మరణించారు. ఆయన 1920లో నరసాపురంలో జన్మించారు. చిన్నతనంలోనే తల్లి పోవడం, తదుపరి చదువు సాగకపోవడంతో ఆయనకు ప్రపంచమే బడి అయింది. ఎన్నో ఉద్యోగాలు చేసి పాలకొల్లులో లైబ్రేరియన్‌గా కూడా పనిచేశారు. కులంలేని పిల్ల, పల్లెపడుచు, అన్నాచెల్లెలు నాటకాలు ఆయనకు పేరు తెచ్చిన రచనలు. బి.ఎ. సుబ్బారావుగారు ఆయనను. సినీ రంగానికి పరిచయం చేశారు. శ్రీ పినిశెట్టి నిత్య కళ్యాణం, పచ్చతోరణం సినిమాకు దర్శకత్వం వహించారు.

"అదేనోయ్ హీరోభక్తి" అన్నాడు రాఘవయ్య నవ్వుతూ.

థియేటరులో చప్పట్లు కొట్టి, ఈలలు వేసి, పువ్వులు జల్లి, "హీరో పట్ల తమకున్న అభిమానాన్ని నిరూపించుకునేందుకు ఊర్లో ఉన్న అభిమానులు అందరూ వచ్చేస్తున్నారు సినిమాకి.

పోలీసు బలగం అంతా వచ్చేసింది. మళ్లీ ఉదయంలాగే మామూలుగా పని మొదలు పెట్టేసేరు.

సినిమా వదిలేస్తున్నట్లుగా 'బెల్' మోగింది.

అరుపులతో, కేకలతో జనాలు బయటకు రావటం మొదలు పెట్టేరు.

"డైలాగులు అదిరిపోయాయిరా" అని ఒకడు, "స్మిత సాంగ్‌లో మనోడు స్టెప్స్ దుల్లగొట్టేసేడ్రా" అని ఇంకొకడు. ఫైట్లు సూపర్ అని మరొకడు అంటూ అనుకుంటూ వస్తున్నారు. నూర్రోజులు గేరెంటీ అన్నాడు ఒకడు, వందరోజులు జూబిలీ గేరెంటీ అని ఇంకొకడు అంటున్నాడు.

సినిమా ఎలా వుందండి అని అడిగాడు ఇంకొకడు. జయసుధ ఉండి ఉంటే ఇంకా సూపర్ హిట్ అయిపోవునండి అని తన విచారాన్ని మరొకడు వెలిబుచ్చేడు.

"సినిమా సూపర్‌హిట్ అయిపోయింది గురూ" అని గట్టిగా అరిచాడు ఒక అభిమాని. ఆ ఆనందం పట్టలేక అభిమానులందరూ ఆనందంగా ఆ అరచినవాడి వైపు చూసారు. ఉత్సాహంగా వాళ్ల తెచ్చిన "బులిటెన్స్" గాలిలోకి విసిరారు. అవి చెల్లా చెదురుగా ఇష్టం వచ్చిన చోట పడుతున్నాయి. అవి అందుకోవడానికి, ఏరుకోవడానికి జనాలు పరిగెట్టారు. చాలా హడావిడి చేసేసారు.

ఈ సందడిలో కొంతమంది లైన్‌లో దూరిపోయారు. "బాబూ దూరిపోయాడు. బయటికి లాగండి" అని వెనకాతల వాళ్ళు అనడం మొదలు పెట్టేరు. "ఎందుకయ్యా మీరొచ్చి" అని పోలీసులను తన కసి కొద్దీ కసురుతూ అరిచాడు ఓ వ్యక్తి.

ఎవడు ఆ దూరిందని పోలీసులు వచ్చారు. ఇదిగో ఒడి ఈడు, అదిగో ఆడు, అల్లదిగో అల్లాడు అని చెప్పటం మొదలు పెట్టేరు వెనకాతల జనాలు.

లైనులో దూరిన వాడిని, దూరని వాడిని కూడా లాగేసేరు. ''నేనూ ఉన్నానండీ'' అంటూ వాడు అరచి మొత్తుకోవటం, పక్కనున్న వాళ్లు ఉన్నాడండీ అని సపోర్టు చెయ్యటం, మళ్లీ లైను లోకి వచ్చేయటం జరిగింది.

నెమ్మదిగా సినిమా వదిలిన హడావిడి సన్నగిల్లే సరికి టిక్కెట్లు ఇచ్చే అలజడి మొదలయ్యింది.

ఉదయం మనిషికి రెండేసి ఇవ్వటంతో చాలామంది జనాలకి టిక్కెట్లు దొరకలేదు. కానీ ఈ మాటు మనిషికి ఒక టిక్కెట్టు మాత్రమే ఇవ్వడం వల్ల చాలామందికి దొరికాయి.

రాఘవయ్య, మూర్తి, పురుషోత్తమరావు థియేటరునించి తొందరగా బయటపడ్డారు.

''మూర్తీ ఇంతకీ ఎక్కడ ఉంటున్నావు'' అనడిగాడు రాఘవయ్య.

''మా చుట్టాలింట్లో ఉంటున్నానండీ. ఎక్కడైనా ఓ మంచి గది దొరికితే మారిపోదామనుకుంటున్నాను'' అన్నాడు మూర్తి.

''మరి అలా చెప్పవేమి! మా ఇంటికి దగ్గిరలోనే ఒక గది ఖాళీ వున్నట్లుంది, ఏరా పురుషోత్తం! ఆ గదిలో ఇంకాఎవడూ దిగలేదు కదా'' అని అడిగాడు రాఘవయ్య.

''ఇంకా ఎవడూ దిగలేదు'' అని బయటికి అని ఎవ్వడూ దిగడు కూడా అని మనసులో అనుకున్నాడు పురుషోత్తం.

''అయితే అక్కడికి వచ్చేయి. ముగ్గురం ఒకచోటే ఉన్నవాళ్లమవుతాము'' అన్నాడు రాఘవయ్య.

''అయితే ట్రై చేద్దాం ఉండండి'' అన్నాడు మూర్తి అయిష్టంగానే. నాయనా మీ ఇంటి ఏరియాలోనే దిగానంటే ఇప్పుడు వేసుకున్న ఫుల్‌పాంటు తీసేసి హాఫునిక్కరు తొడుక్కోవలసిన పరిస్థితి ఏర్పడుతుంది అని మనసులో అనుకుంటున్నాడు.

సరే అయితే సాయంత్రం కలుద్దాం అంటూ రాఘవయ్యా, పురుషోత్తం ముసిలి సైకిలు మీద డౌన్‌లోకి వెళ్లిపోయారు. మూర్తి తిన్నగా వెళ్లిపోయాడు.

రాఘవయ్య ఇంటికి ఎదురుగా కుడిచేతి పక్క నుంచి ఐదో ఇల్లు పురుషోత్తమరావుది. మూర్తికి చెప్పిన ఇల్లు రాఘవయ్య ఇంటి నించి ఏడో ఇల్లు. ఆ ఇంటికి ఇరువైపులా పాకల్లో నివసిస్తూ ఉంటారు కొందరు. రోజూ ఉదయాన్నే రేడియోలో సుప్రభాతం వచ్చినట్లు ఆ పాకల్లోవాళ్లు ఎవరో ఒకరు తగువులు ఆడుకుంటూ ఉంటారు. తగువు రాకపోయినా సరే ఏదో ఒక విధంగా తగువు తెచ్చుకుంటారు. వాళ్లకి తగువు తిండిలాంటిది. అందుకే ఆ ఇంట్లో ఎవరు దిగినా సరే ఏడు రోజుల కంటె ఎక్కువ ఉండరు; ఉండలేరు కూడా.

రాఘవయ్య, పురుషోత్తం వాళ్లు ఉంటున్న వీధిలోకి వచ్చారు. రాఘవయ్య తనింటికి వచ్చేసేడు.

ఒక వరండా, ఓ బెడ్‌రూం, ఒక చిన్న బాత్‌రూం, పిల్ల స్టడీరూం, ఒక వంటగది, ముసలి వరుడు లాగ పెరడు. ఇదీ అతని ఇల్లు.

భోజనం అయ్యింది అనిపించుకొని పడకగదిలోకి వచ్చాడు రాఘవయ్య. అతని పడకగది అంతటికీ అందం ఇస్తున్న షార్ప్ స్టీరియో సెట్ దగ్గరకి వెళ్లి అది 'ఆన్' చేసాడు. ఘంటసాల భగవద్గీత వస్తున్నాది. వెంటనే ఆపుచేసి ఇజెక్ట్ నొక్కి ఆ కేసెట్టు తీసేసి బాలసుబ్రహ్మణ్యం పాడిన డిస్కో సాంగ్స్ పెట్టి 'ఆన్' చేసాడు. వస్తున్న మ్యూజిక్‌కి లయగా చిటికెలు వేస్తూ తన షర్టు జేబులో నించి సిగరెట్టు తీసి ముట్టించాడు. గుండెల నిండా దమ్ములాగి తృప్తిగా వదులుతూ మంచం మీద మేను వాల్చాడు. అంతే సిగరెట్టు ఇంకా సగం ఉంది అనగానే నిద్రలోకి జారిపోయాడు రాఘవయ్య. తనపైన చూపించిన నిర్లక్ష్యానికి రాఘవయ్యని తిట్టుకుంటూ చేతిలోనించి నేల మీదకి జారి పడిపోయింది సిగరెట్టు. మంచంమీద పడిపోతే ఎంత బాగుణ్ణు అని అనుకుంది.

వెళ్లలేక వెళ్లలేక, వదలలేక విడవలేక పుట్టిల్లుకి వీడ్కోలు చెప్పి అత్తవారింటికి వెళ్లిన పెళ్లికూతురిలాగ సాయంత్రం సూర్యుడు అస్తమించాడు.

చాప చిరిగినా చదరంత మిగిలినట్లు ఎండ పోయినా వేడి మాత్రం ఇంకా పోలేదు. కాసేపు చల్లదనం కోసం ఉదయం వేడి గాడ్పు లకు మగ్గిపోయిన ప్రజలు ఏ.సి.లో సేదతీర్చు కోవడానికి ఏ.సి. థియేటర్లకి రాత్రి బాగా వచ్చి సంఖ్య పెంచేస్తున్నారు. ఎలాంటి చెత్త సినిమా అయినా సరే హాలు నిండిపోయి తీరాలి.

ఉదయం మగవాళ్లు ఎక్కువ వచ్చారు. సాయంత్రం మగవాళ్లకి సమానంగా ఆడవాళ్లు వచ్చారు. ఇప్పుడు సెకెండ్ షోకి మీరాచిపోయినట్లున్నారు.

సమయం రాత్రి 8.55 నిమిషాలు అయ్యింది. రాఘవయ్యా, మూర్తీ, పురుషోత్తం చేతుల్లో సిగరెట్లు కాల్తున్నాయి.

''మొత్తానికి ఇవాళ్టి డ్యూటీ నిర్వహించేసాము'' అన్నాడు మూర్తి దమ్ము వదులుతూ.

''ఇంక మనం బయల్దేరితే బాగుంటుంది'' అని అన్నాడు పురుషోత్తం సహనాన్ని ఓర్చుకోలేక.

''సరే పదండి'' అన్నాడు ఏదో ఆలోచిస్తున్న రాఘవయ్య.

ముగ్గురూ రోడ్డుమీదకి వచ్చారు. పురుషోత్తం ''వస్తాను'' అనేసి కట్ అయిపోయాడు.

రాఘవయ్యా మూర్తీ పోలీసు స్టేషన్‌కి వచ్చేసేరు. సాయంత్రం డ్యూటీ వాళ్లు వెళ్లిపోయారు. మూర్తి రైటరుగారితో చెప్పేసి మళ్లీ కనకారావు బండే తీసుకున్నాడు.

రాఘవయ్యా, మూర్తీ బయట నిలుచుని ఉన్నారు. ఈ లోపున కనకారావు వచ్చాడు. ఓ సిగరెట్టు అడిగాడు. మూర్తి తీసి ఇచ్చాడు. కనీసం సైకిల్ జాగ్రత్త అని కూడా చెప్పలేదు. మాంసం లేని దుమ్ములను చూసిన రాబందు లాగ పట్టించుకోకుండా వెళ్లిపోయాడు. రాఘవ

డాక్టర్ కేశవరెడ్డి తాజా హిట్ సీరియల్

రాముడుండాడు రాజ్జివుండాది

త్వరలో త్వరలో త్వరలో

య్య చెప్పిన మాటల్లో గల యథార్థాన్ని అప్పుడు గ్రహించాడు మూర్తి.

కడుపులో ఆకలి సంచలనాన్ని సృష్టించడం మొదలు పెట్టేసరికి మూర్తి "వస్తానండి" అన్నాడు రాఘవయ్యతో.

"ఇల్లు గురించి మర్చిపోకు" అని గుర్తు చేసాడు రాఘవయ్య.

అలాగేనండీ అంటూ సైకిలు ఎక్కి వీధి దీపాలు పగలకొట్టబడిన వీధిలోకి మళ్లించాడు.

"నీలాగే ప్రతీ పోలీసు ఉండి ఉంటే ఈ పాటికి మన పోలీసులు ఇనపరేకులు అమ్ముకొందురు. మన స్టేషన్ మీద ఉచ్చలు పోసేద్దురు. ఇప్పుడు ఇన్‌డైరెక్ట్‌గా విసుర్లు విసురుతున్న వాళ్లందరూ మన ముఖం మీద ఉమ్మి వేసేద్దురు. అందుకే ప్రమోషను రాలేదు నీకు. వృద్ధ జంబుకంలాగ ఎదుగూ బొదుగూ లేకుండా అలాగే ఉండిపోయావు. నీ ఇంటి ఏరియాలో నేను ఇల్లు అద్దెకి దిగానంటే నేనూ మరో రాఘవయ్యను అయిపోయే ప్రమాదం ఉంది. మీలాంటి వాళ్లకు దేముడు ఎప్పుడు బుద్ధి చెప్తాడో, మన పోలీసులకు ఎప్పుడు మంచి పే... వస్తుందో" అని రాఘవయ్య గురించి అనేకమైన విధాలుగా ఆలోచిస్తున్నాడు మూర్తి. సైకిలు చీకట్లో నించి వెలుగులోకి వచ్చింది.

ఒక్కసారి వెలుగు ముఖం మీద పడటంతో మూర్తి ఆలోచనలకు తెర మూతపడింది. సైకిలు జాగ్రత్తగా తొక్కుకుంటూ ఇంటికి వచ్చాడు.

సరిగ్గా రాత్రి 11.25కి లాడ్జీల మీద దండయాత్రకి బయల్దేరింది పోలీసు వ్యాను. రాఘవయ్యా మరో నలుగురు పోలీసులూ ఉన్నారు. మిగిలిన సీట్లు పాపుల కోసం నిరీక్షిస్తున్నాయి. ఇవాళ అయినా మాకు బరువు మోపుతారో లేకపోతే లంచాలు తీస్కుని మీ జేబులు బరువు చేస్కుంటారో అన్నట్టు వెలవెల పోతున్నాయి సీట్లు.

వరుసగా ఆరు లాడ్జీలపై దాడి చేసారు, నాలుగింటి మీద దయాదాక్షిణ్యాలు చూపించకుండా. మిగిలిన రెండింటిమీద మాత్రం కనికరం చూపించారు. లక్ష్మీదేవి కటాక్షానికి లొంగిపోయారు.

రాఘవయ్య మధ్యలో వ్యాన్ ఆపించి వాళ్ల ఇంటికి సమీపంలో గల వీధిలో దిగిపోయాడు.

ఆ వీధి చాలా నిర్మానుష్యంగా ఉంది. ఉదయం చెత్తకుండీ పక్కన పడుకున్న కుక్క రాత్రికి మాత్రం పక్క ధూళిలో సరిగా కునుకు తీయలేక తీస్తున్నాది. ఆ వీధిలో అంతవరకూ ఉన్న ప్రశాంతతలో మార్పు వచ్చేసరికి ఠక్కున మెలుకువగా ఆ చప్పుడు వస్తున్న వైపు చూసింది. ఉదయం వెళ్లిన ఆకారమే అని గుర్తించి చేతివైపు చూసి లాఠీ లేదని గమనించింది.

ఉదయం నించి తిండి లేక డొక్క మాడిపోతుంది. ఊరినిండా ముష్టివాళ్లు ఎక్కువ అయిపోవడంతో దొరికే ఎంగిలి విస్తరాకులు కూడా కరువైపోయాయి. అందులోకీ రోజూ చూడని కొత్త ముష్టి ముఖాలని చూసింది ఇవాళ ఆ వీధిలో అడుక్కుంటూ వెళ్లటం. ఇది అంతా ఈ వస్తున్న అపశకునపు ముఖం ఉదయాన్నే తను చూడటం వల్లనేనేమో అన్న సందేహం దాని మనసులో ప్రవేశించింది. దాన్తో దాని ఆకలి మంటలో కోపం అనే ఆజ్యం పోసినట్లయింది. ఒళ్లు జల్లుమంది. ముడుచుకున్న తోక నిటారుగా లేచింది. రోమాలు నిక్కబొడుచుకున్నాయి. ఎలాగూ ఆ మనిషి చేతిలో కర్ర లేదు కదా. దాన్తో దానికి "కుక్క ధైర్యం' వచ్చేసింది. రాఘవయ్యని దగ్గిరకి రానివ్వ సాగింది. అది తను చేయబోయే పని తల్చుకునే సరికి గుండె వేగంగా కొట్టుక్కోసాగింది. కాళ్లలో లేని సత్తువు రాసాగింది.

రాఘవయ్య ఇంటి గురించి ఆలోచిస్తున్నాడు. ఇప్పుడు వాళ్ల వీధిలో కొళాయి దగ్గిర నీళ్లు పట్టుకుంటూ ఉంటారు తమ వీధిలో వాళ్లు. బుర్రకథ అయినా వినగలమేమో కానీ వీధి కొళాయి దగ్గిర జరిగే గొడవల్లో ఆడవాళ్లు ఆడుకొనే బూతులు వినటం మహా కష్టం. ఇలాంటప్పుడు నిద్రపట్టాలి అంటే తను ఉంచిన 'పావురమ్మ సీసా'కి పని కల్పించాలి అని ఆలోచిస్తూ నడుస్తున్నాడు. నెమ్మదిగా ఆ కుక్క ఉన్న జాగా సమీపించాడు.

గర్‌ర్‌ర్...మని దాని భాషలో తిడుతూ రాఘవయ్య మీద ఒక్క ఉరుకు ఉరికి అతని ఎడం కాలును తన కసికి తన సత్తువ కొద్దీ గురి చేసి, మరి దొరక్కుండా, ఆ సందులోనించి పరిగెట్టి చీకట్లోకి కలిసిపోయింది ఆ బతికి చెడిన కుక్క.

అంతా త్రుటిలో జరిగిపోయింది.

రాఘవయ్యకి ఆ పరిస్థితికి ఎలా రియాక్షన్ అవ్వాలో కాసేపు తెలీలేదు. కుక్క కరిచింది అని మట్టుకు తెల్సుకున్నాడు. తెల్సుకునే సరికి పావురమ్మ రమ్మంతా ఒక్కసారి ఒకే పెగ్‌లో తాగినట్లుయింది. అప్రయత్నంగా "కుక్క కరిచింది బాబోయ్! నన్ను కాపాడండీ" అని మటుకు అరవగలిగాడు. అంటూనే నేలకి ఒరిగిపోయాడు.

ఆ పొలికేక సందు చివర్న చప్టామీద పడుకున్న ముష్టివాళ్ళకి వినబడి ఉలిక్కిపడి లేచారు. వెంటనే పరిస్థితిని గ్రహించారు. పడిపోయిన రాఘవయ్యను లేపుకుని దగ్గిర్లో ఉన్న ఆర్‌యంపీ డాక్టరు దగ్గిరకు తీస్కుపోయారు.

ఎప్పుడు, ఎక్కడ, ఎవడికి, ఎలా, ఏమని రాసిపెట్టి ఉందో ఎవరమూ చెప్పలేం కదా.

ఇంకా నయం గుడ్డిలో మెల్ల ఏ కరంటు వైర్లో తెగి మీద పడలేదు. రమణికి తాళి గట్టిగా కట్టి ఉంటాడు రాఘవయ్య.

కానీ ఇవి ఏమీ పట్టించుకోకుండా సూర్యుడ్ని తొందరగా ఉదయింపజేయాలనే ఉద్దేశంతో కాలచక్రం ఆతృతగా ముందుకు నడుచుకు పోతున్నది.

## గువ్వలు

అనుభూతుల గువ్వలు
ఈ గూడులో ఒదిగిపోతాయి.
పదములను ఒడలంతా అద్ది,
ఉద్వేగపు రంగులను ఆపై అలది,
ఆశల తటాకంలో తడిపి
అలా ఎగుర వేద్దామంటే—

ఆ గువ్వలు,
అనుభూతుల గువ్వలు
ఒళ్లమంటాయి.
గుండెగూడులో ఒదిగొదిగి
పోతాయి!

మాటల కందని మెరుపుతో
వెలిగిపోతాయి!
నా అస్తిత్వపు స్పృహనే
మరిపిస్తాయి!

—సుధ.